క్లుప్తంగా

మంత్రి దృష్టికి నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు

మండపేట: భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను మండపేట తాపీ మేస్త్రీల సంఘం మాజీ అధ్యక్షుడు, జిల్లా నూర్ బాషా సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం కోరారు. గురువారం ఆయన రామచంద్రపురం వెళ్లి మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి కార్మికులు పనుల్లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియపరిచినట్టు ఇబ్రహీం తెలిపారు. దీనిపై మంత్రి సుభాష్ సానుకూలంగా స్పందించారని చెప్పారు.

15న పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవం

కపిలేశ్వరపురం: ఎంజీఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభల్లో అందిన ప్రతిపాదనల నేపథ్యంలో మంజూరైన ఉపాధి పనుల ప్రారంభ కార్యక్రమాన్ని పల్లె పండుగ పేరుతో ఈనెల 15న నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి గురువారం తెలిపారు. ఉదయం 9 గంటలకు కోరుమిల్లి, 10 గంటలకు కపిలేశ్వరపురం, 12 గంటలకు అచ్యుతాపురం, 12.30న వల్లూరు, మధ్యాహ్నం 3 గంటలకు అద్దంకివారిలంక గ్రామాల్లో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించినట్టు ఎంపీడీఓ తెలిపారు.

రతన్‌టాటా మృతికి కాంగ్రెస్ సంతాపం

మండపేట: భారత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మరణం పట్ల కాంగ్రెస్ పార్టీ తరఫున ఆ పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావు గురువారం సంతాపం తెలిపారు. కామన మాట్లాడుతూ రతన్‌టాటా మరణం యావత్ భారత ప్రజలందరినీ కలచి వేసిందన్నారు. మన దేశం ఒక మహోన్నతమైన వ్యక్తిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం తీరని లోటని పేర్కొంటూ తన సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని శివల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని మసకపల్లి, భట్లపాలిక, తాళ్లపోడు, గుడిగళ్లబాగ, పేకేరు, దంగేరు, బాలాంత్రం,అద్దంపల్లి, వట్రపూడి, యర్రపోతవరం, శివల గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పైప్‌లైన్ సమస్యకు పరిష్కారం



పామర్రులో పైప్‌లైన్‌ను బాగు చేస్తున్న దృశ్యం

కె.గంగవరం: మండలంలోని పామర్రులో తాగునీటి పైప్‌లైన్ దెబ్బతిని నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీనిపై 'నిలువెత్తు నిర్లక్ష్యానికి నిదర్శనం' శీర్షికతో గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దెబ్బతిన్న పైప్‌లైన్ మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి సీతారామయ్య ఆధ్వర్యంలో కార్మికులు గొయ్యి తవ్వి దెబ్బతిన్న పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. నీరు బయటకు రాకుండా చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు, ప్రయాణికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఇంపాక్ట్

ఆకట్టుకున్న అయ్యప్ప భక్తుల పేటతుళ్లి



వెదురుపాకలో పేటతుళ్ల ఆడుతున్న అయ్యప్ప భక్తులు

రాయవరం: మండలంలోని వెదురుపాక గ్రామంలో అయ్యప్ప మాలధారుల పేటతుళ్లి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక జనార్దనస్వామి ఆలయంలో అయ్యప్ప పీఠం గురుస్వామి బండారు వెంకటరమణస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తుల పేటతుళ్లి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయం ప్రాంగణం నుంచి అయ్యప్ప భక్తులు 'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణ నడుమ గ్రామోత్సవం చేపట్టారు. అయ్యప్ప భక్తులు వేసిన వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామి తదితర వేషధారణలు ఆకట్టుకున్నాయి. గ్రామంలో అయ్యప్ప మాలధారులు అయ్యప్పస్వామి పేటతుళ్లి పాటలకు అనుగుణంగా చేసిన నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అయ్యప్పభక్తులు కొవ్వూరి ధర్మారెడ్డి, అంగర వెంకటసుబ్బారావు, వీరబాబు, కొవ్వూరి చినసత్తిరెడ్డి, భానుప్రకాష్, వరహాలరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మణికంఠ, బాబురావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తు.. పల్లెలు చిత్తు

- గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- బెల్టుషాపుల నిర్వహణలో టీడీపీ నేతలదే కీలక పాత్ర
- కొన్ని గ్రామాల్లో 24 గంటలూ అందుబాటులో లిక్కర్



తాగి పడేసిన మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లతో నిండిన సుందరపల్లి పుష్కర ఘాట్

కె.గంగవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో మద్యం భూతం మళ్లీ జడలు విప్పింది. పల్లెల్లో విచ్చలవిడిగా వెలసిన బెల్టు షాపుల్లో 24 గంటలూ మద్యం విక్రయాలు సాగుతున్నాయి. గడిచిన మూడు నెలలుగా ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి నేరుగా గ్రామాలకు మద్యం సీసాలు తరలిపోతున్నాయి. అడపాదడపా పోలీసుల దాడుల్లో అక్రమ మద్యాన్ని సీజ్ చేస్తున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. గ్రామాల్లో బెల్టు షాపుల దందా సాగిస్తున్న వారు కూటమి నేతలు కావడంతో దాడులు చేసేందుకు పోలీసులు సైతం వెనకగుడు వేస్తున్నారు. కోరి తలనొప్పి తెచ్చుకోవడం ఎందుకున్న ఆలోచనలో ఖాకీలు ఉన్నట్లు తెలుస్తోంది.

నియోజకవర్గంలో...

రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్, పట్టణంలో అన్ని గ్రామాల్లో వార్డుల్లో మద్యం ఏరులై పారుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపడంతో పాటు పరివర్తన కార్యక్రమాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంచినీరు దొరకని గ్రామాలు ఉన్నాయి కాని మద్యం దొరకని గ్రామాలు మాత్రం మచ్చుకు ఒక్కటి కూడా లేదనడంలో అతిశయోక్తి లేదు. కె.గంగవరం మండలంలోని పామర్రు, కె.గంగవరం, కుందూరు, యర్రపోతవరం, దీంతో పాటు ద్రాక్షారామ, కాజులూరు, రామచంద్రపురం పట్టణంలో ప్రభుత్వ మద్యం షాపుల నుంచి మద్యం విక్రయదారులు గ్రామాల్లోని బెల్ట్ షాపులకు మద్యం బాటిళ్లను తరలిస్తున్నారు. ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై అదనంగా రూ.50 నుంచి రూ.100 వసూలు చేస్తున్నారు. అది కూడా కల్తీ చేసి అమ్మకాలు జరుపుతున్నారు. రామచంద్రపురం పట్టణంలో బాటిల్‌పై రూ.100 నుంచి రూ.150 వరకూ అదనంగా గుంజుతున్నారు.

కుటుంబాలు ఆగమాగం..

తెల్లవారుజాము మొదలుకుని అర్ధరాత్రి వరకూ విచ్చలవిడిగా గ్రామాల్లో మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. దీంతో పలు గ్రామాల్లో మందుబాబులు రాత్రి అయితే చాలు ఘర్షణకు దిగడమే కాకుండా అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. అంతేకాక భార్యభర్తల మధ్య ఘర్షణలు తలెత్తి పంచాయితీలు పోలీస్‌స్టేషన్లకు చేరుతున్నాయి. యువత మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. మద్యం మత్తులో కొందరు సైకోలుగా ప్రవర్తిస్తున్నారు. మందుబాబులు ఫుల్‌గా తాగిన తర్వాత మద్యం బాటిళ్లను రోడ్లపైనే పగులకొట్టి రాక్షసానందం పొందుతున్నారు.

ప్రభుత్వ షాపుల్లో చీప్ లిక్కర్ కరవు

ప్రభుత్వ మద్యం షాపుల వద్ద గత రెండు నెలలుగా చీపులిక్కరు ఉండడం లేదు. రూ. 120. రూ.130, రూ.150 రకాలకు చెందిన బ్రాండ్లు షాపుల వద్ద ఉండడం లేదు. ఈ మద్యాన్ని కేసులతో బెల్ట్‌షాపులకు తరలించి ఒక్కో క్వాటర్‌కు రూ.50 నుంచి రూ.100 వరకు వసూళ్లు చేస్తున్నారు. ప్రభుత్వ షాపుల వద్ద తక్కువ రకం మద్యం ఉండకపోవడంతో బెల్ట్‌షాపుల వద్దే మద్యం ప్రియులు ఎక్కువ ధరకు కొనుగోలు చేసుకుని జేబులు చిల్లు చేసుకుంటున్నారు.

నీదా.. నాదా..

ప్రస్తుతం గత వారం రోజుల నుంచి గ్రామాల్లో బెల్ట్ షాపులపై బేరసారాలు సాగుతున్నాయి. బెల్ట్‌షాపు నీదా..నాదా అనే అంశంపై చర్చలు పెట్టుకున్నారు. బెల్టు షాపులను టీడీపీ నేతలే గ్రామాల్లో వేలం పాడుకుని నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధాన షాపుల ఎవ్వరికి దక్కినా ప్రతి గ్రామంలో బెల్ట్‌షాపుల ఏర్పాటు చేసేందుకు టీడీపీ నేతలు సమాయత్తమయ్యారు. కె.గంగవరం మండలంలోని పలు రెస్టారెంట్ల వద్ద బహిరంగంగానే మద్యం తాగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికి తోడు మందుబాబులు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పుష్కర ఘాట్లను మద్యం తాగేందుకు అడ్డాగా మార్చుకుంటున్నారు. పల్లెల్లోని ఖాళీ స్థలాల వద్ద ఏటి గట్టుపై ఉన్న పుష్కర ఘాట్ల వద్ద తెల్లవారేసరికి తాగిపడేసిన మందు సీసాలు, వాటర్ బాటిళ్లు, సిగరెట్ పీకలు దర్శనమిస్తున్నాయి.

అధికారులు చర్యలు తీసుకోవాలి



గ్రామాల్లో బెల్ట్ షాపులు విపరీతంగా పెరిగాయి. ప్రతి రోజు తెల్లవారు జాము నుంచి అర్ధ రాత్రి వరకు మద్యం అమ్మకాలు జరుపుతున్నారు. కనీసం అధికారులు పట్టించుకోవడం లేదు. బెల్ట్‌షాపుల వల్ల కొంత మంది జీవితాలు నాశనం అవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– జుత్తుక శ్యాంప్రసాద్, స్థానికుడు, కె.గంగవరం

బెల్ట్ షాపులను నియంత్రించాలి



ప్రస్తుతం మద్యం షాపులను ప్రైవేటు పరం చేయడం వల్ల చాలా అనార్థాలు ఉన్నాయి. గ్రామ స్థాయిలో బెల్ట్‌షాపుల కోసం బేరసారాలు జరుగుతున్నాయి. ప్రైవేటు మద్యం అమ్మకాల వల్ల ప్రతి గ్రామంలోనూ, ప్రతి వీధిలోనూ బెల్ట్‌షాపులు ఉంటాయి. దీంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రభుత్వం ఆలోచించి బెల్ట్‌షాపులను నియంత్రించాలి.

– కొప్పిశెట్టి లక్ష్మణ్, ఎంపీటీసీ, దంగేరు

సింగిడిలో రంగుల సోయగం



వెనుక నీలాకాశం.. మధ్యలో పచ్చని కొబ్బరి చెట్లు.. ముందు భాగంలో అయ్యప్ప మందిరం.. అరచేతిలో రేఖ మాదిరిగా ఆ మూడింటినీ కలుపుతూ సింగిడి(ఇంద్రధనస్సు) కనువిందు చేసింది. ఈ దృశ్యం గురువారం మండపేట పట్టణంలోని గుమ్మిలేరు రోడ్డులోని మాండవ్యపుర మణికంఠుడు వెలసిన అయ్యప్ప ఆలయం వెనక ఆవిష్కృతమైంది. స్థానికులు ఈ సుందర దృశ్యాన్ని వీక్షించి ఆనందించారు.

– మండపేట

ఏఎన్ఎం తీరుపై ఆశా వర్కర్ల ఆందోళన



గొల్లపాలెం పీహెచ్‌సీ డాక్టర్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు

కాజులూరు: శలపాక ఏఎన్ఎం పంపన రామకృష్ణవేణి తీరుపై ఆశా వర్కర్లు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు గురువారం ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నల్ల ఈశ్వరి, జిల్లా ప్రధానకార్యదర్శి చంద్రమల్ల పద్మ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు గొల్లపాలెం పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ సీవీఎల్ శ్రీయకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్ల ఈశ్వరి, చంద్రమల్ల పద్మ మాట్లాడుతూ ఏఎన్ఎం పంపన రామకృష్ణవేణి శలపాక ఆశా వర్కర్లు అనంతలక్ష్మి, విజయలక్ష్మి పట్ల అసభ్య పదజాలంతో మాట్లాడి అవమానకరంగా ప్రవర్తిస్తున్నారన్నారు. దీనిపై బాధితులు మెడికల్ ఆఫీసర్లకు ఫిర్యాదు చేయడంతో గత నాలుగు నెలలుగా జీతాల బిల్లు పెట్టకుండా వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన న్యాయం చేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు లంక దుర్గాదేవి, పి. వెంకటలక్ష్మి, ఎం .దుర్గాదేవి, కె.విజయసురేఖ, బి.సుశీల తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవీ నమోస్తుతే..



వ్యాఘ్ర వాహినిగా కొత్తూరు దుర్గాదేవి



దుర్గాదేవి అవతారంలో ఆదివారపుపేట పార్వతి అమ్మవారు



మహాకాళీదేవి అవతారంలో ద్రాక్షారామ కన్యకాపరమేశ్వరి అమ్మవారు



దుర్గాదేవిగా ద్రాక్షారామ మాణిక్యాంబా అమ్మవారు

- విశేష అలంకరణలో దర్శనమిచ్చిన జగన్మాత
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రామచంద్రపురం రూరల్: దసరా మహోత్సవాలు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా దక్షిణకాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో సువర్ణ, రజత పుష్పాలతో విశేష పూజలు నిర్వహించారు. ద్రాక్షారామలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు మహాకాళీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి గోపాల్, ఉపాధ్యక్షుడు పసుమర్తి సూర్యశేఖర్, ప్రధాన కార్యదర్శి అప్పన రాజశేఖర్, కోశాధికారి వెచ్చా కిషోర్, కార్యదర్శులు పసుమర్తి అరుణ్‌కుమార్, త్రిపురమల్లు గోపాల్ పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారపుపేటలోని శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతి అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకుడు బోండు బాల బ్రహ్మత్వంలో విశేష పూజలు నిర్వహించారు. శివబాలయోగి మహారాజ్ ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

వ్యాఘ్ర వాహినిగా కొత్తూరు దుర్గా అమ్మవారు

రామచంద్రపురం: పట్టణంలో ప్రసిద్ధి చెందిన కొత్తూరు దుర్గా అమ్మవారు గురువారం వ్యాఘ్ర వాహినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అరిషడ్వర్గాలను విడనాడాలి



దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన రాయవరం పార్వతీ సమేత రాజేశ్వరస్వామి




ప్రత్యేకాలంకరణలో సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



మండపేట పట్టణంలో జ్యోతులతో ఊరేగుతున్న మహిళలు

- వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్
- దుర్గామాతగా దర్శన మిచ్చిన విజయదుర్గ అమ్మవారు
- ఘనంగా శరన్నవరాత్ర వేడుకలు



వెదురుపాక పీఠంలో భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న గాడ్

రాయవరం: మనసులోని అరిషడ్వర్గాలను విడనాడితే దైవత్వానికి దగ్గర కావచ్చని మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. పీఠంలోని విజయదుర్గా అమ్మవారు గురువారం దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠానికి హాజరైన భక్తులను ఉద్దేశించి 'గాడ్' ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. మంచి మనస్సు, ఆలోచన, సంకల్పం ఉన్న వారికి దైవం ఎన్నడూ తోడుగా ఉంటుందన్నారు. పీఠబ్రహ్మ శివ, అర్చకులు చీమలకొండ వీరావధాని, చక్రవర్తుల మాధవాచార్యులు, తోలేటి నాగేంద్ర శర్మ తదితరులు విజయదుర్గ అమ్మవారిని ఉదయం దుర్గాదేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మూల పూజలు కావడంతో భక్తులతో పీఠం కిటకిటలాడింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి చెంతన సామూహిక కుంకుమ పూజలు చేసి పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. పీఠానికి వచ్చిన భక్తులకు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కర నారాయణ, సత్యవెంకట కామేశ్వరి, సత్య కనకదుర్గ, బలిజేపల్లి రమ తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు.

సామూహిక కలశ పూజలు

స్థానిక దుర్గాదేవి ఆలయం వద్ద గురువారం కలశ పూజలు నిర్వహించారు. అర్చకుడు కాల్దారి త్రినాథ శర్మ, మహిళలు సుహాసిని, కుమారి పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో కలశపూజల్లో పాల్గొన్నారు. ముందుగా కలశాలను శిరస్సున ధరించి మేళ తాళాలతో గ్రామంలో ఊరేగించారు. భవానీ భక్తులు ఊరేగింపులో పాల్గొని భవానీ నామస్మరణ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రాయవరం, పరిసర గ్రామాలకు చెందిన వందల మంది మహిళలు కలశ పూజల్లో పాల్గొన్నారు. రాత్రి సమయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

కిటకిటలాడిన దేవాలయాలు

శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా పలు ఆలయాలు కిటకిటలాడాయి. అమ్మవార్లను దుర్గాదేవి రూపంలో నయన మనోహరంగా అలంకరించారు. రాయవరంలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు విలపర్తి ఫణిధర్‌శర్మ, శశిధర్‌శర్మ, సోమేశ్వరం చారిత్రక శివాలయమైన శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో ప్రధానార్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని వెదురుపాక, రాయవరం, వి.సావరం, లొల్ల, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన శరన్నవరాత్ర ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. దుర్గాదేవి అవతారం కావడంతో అధిక సంఖ్యలో మహిళలు దుర్గాదేవి, శివాలయాలకు పోటెత్తారు.

మండపేటలో..

మండపేట: గురువారం దుర్గాష్టమి కావడంతో పట్టణంలో అమ్మవారి ఊరేగింపు సంబరాలు మిన్నంటాయి. వీరభద్రపురంలో నెలకొల్పిన దుర్గమ్మ, సైదిల్‌పేటలో వెలసిన సత్తి వారి దుర్గమ్మలు పట్టణంలో ఊరేగారు. సత్తి సత్తిబాబు, వీరలక్ష్మి ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గరగ నృత్యాలు, దేవతామూర్తుల వేషధారణలు, కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. భవానీ మాలలు వేసిన మహిళలు ప్రమిదలలో జ్యోతులు వెలిగించి అమ్మవారి రథం వెంట నడిచారు. జాంపేట వీధిలో మహిళలు ప్రత్యేకంగా జ్యోతులతో గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆద్యంతం సందడిగా గ్రామోత్సవం సాగింది. అదే విధంగా శ్రీరామ సెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో నవరాత్ర వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారి జన్మనక్షత్రం మూలా నక్షత్రం సందర్భంగా ఇక్కడ లక్ష బిల్వార్చన నిర్వహించారు. విగ్రహదాత బిక్కిన గోపాలకృష్ణ పూజల్లో పాల్గొని అమ్మవారిని ఆరాధించారు. అనంతరం ఆయనను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

కపిలేశ్వరపురంలో చండీయాగం



దుర్గాపీఠంలో అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: స్థానిక దుర్గాపీఠంలో గురువారం చండీయాగం పూజలు చేశారు. పీఠం నిర్వాహకులు భాస్కరస్వామి ఆధ్వర్యంలోని వేద పండితులు అమ్మవారిని విశేషంగా అలంకరించారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా పీఠం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. దేవీ సెంటర్‌లోని అమ్మవారి ఆలయంలో నామాల శ్రీను దంపతులు కుంకుమ పూజచేశారు. అంగర, పడమర ఖండ్రిక, తాతపూడి, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, నిడసమెట్ట, నాగులచెరువు, వాకతిప్ప, టేకి, మాచర తదితర గ్రామాల్లో చిన్నారులు తమ పుస్తకాలను అమ్మవారి వద్ద ఉంచి పూజలు చేశారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



నిప్పుల గుండపై నడుస్తున్న భక్తులు

కాజులూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా గొల్లపాలెం-కాజులూరు జంక్షన్‌లో వేంచేసిన దుర్గాదేవి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు బాదంపూడి నాగవెంకటసుబ్రహ్మణ్యం, సతీష్ స్వామి ఆధ్వర్యంలో 10 మంది రుత్విక్కులు గణపతిహోమం నిర్వహించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ రిటైడ్ అధికారి సనపాల ధనరాజు, ఇందిరాదేవి దంపతులు భవాని భక్తులతో కలసి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి ఆలయంలో ప్రతిష్ఠించారు. రాత్రికి ఆలయం వద్ద నిప్పుల గుండం ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు ఆరు వందల మంది భవానీ భక్తులు నిప్పుల గుండంపై నడిచి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన మహిళలు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.